మినీ జాతరలకు ఏర్పాట్లు పూర్తి


ముస్తాబైన సమ్మక్క గద్దె


సారలమ్మ గద్దె

- నేడు ప్రారంభం కానున్న జాతరలు
- సర్వం సిద్ధం చేసిన నిర్వాహకులు

మొగుళ్లపల్లి: మండలంలోని మొగుళ్లపల్లి–ముల్కల పల్లి గ్రామాల మధ్య మీని మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరను 1977 నుంచి నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చొరవతో జాతరకు రూ.16 లక్షల నిధులు మంజూరైనట్లు నిర్వాహకులు తెలిపారు. రెండు వాగుల ఒడ్డున నేడు బుధవారం నుంచి జరిగే జాతరకు సర్వం సిద్ధం చేశారు. వనదేవతలకు స్వాగతం పలికేందుకు సన్నాహాలు పూర్తయ్యాయి. జాతరకు సుమారు ఆరు మండలాల్లోని గ్రామాల నుంచి భక్తులు వచ్చి దర్శించుకుంటారు. జాతరను ప్రశాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. వనదేవతల జాతరకు తాగునీరు, కరెంట్, ప్రత్యేకంగా స్నానఘట్టాలు ఏర్పాటు చేశారు. కాగా జాతరకు పరకాల, చిట్యాల, జమ్మికుంట నుంచి బస్సు సౌకర్యం కల్పించారు. అలాగే జాతరలో చేపడుతున్న పనులను అధికారులు మంగళవారం పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం..



జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. భక్తులు ప్లాస్టిక్ కవర్లను తీసుకరావొద్దు. జాతరలో ప్లాస్టిక్‌ను నిషేధించాం. జాతరను విజయవంతం చేయడానికి అన్ని వర్గాల ప్రజలు సహాయ సహకారాలు అందించాలి.

– చదువు అన్నారెడ్డి, జాతర కమిటీ అధ్యక్షుడు


ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకులు


గుర్రంపేట మినీ మేడారం జాతర ప్రాంగణం

నేడు గుర్రంపేట జాతర ప్రారంభం

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని గుర్రంపేట మినీ మేడారం జాతర పనులు పూర్తయ్యాయి. బుధవారం సాయంత్రం మండలంలోని లక్ష్మీపురం పక్కన గల సత్యనగరం నుంచి సారలమ్మను తీసుకురావడంతో జాతర ప్రారంభమవుతుంది. గురువారం సాయంత్రం గ్రామానికి ఉత్తరాన ఉన్న సమ్మక్క లొద్ది(గుట్ట) నుంచి సమ్మక్కను తీసుకువస్తారు. శనివారం సాయంత్రం వరకు భక్తులకు ప్రవేశం కల్పించనున్నారు. జాతరకు భూపాలపల్లి, గణపురం, వెంకటాపూర్ మండలాలతో పాటు తదితర గ్రామాల నుంచి సుమారు 3 లక్షల మంది భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి...

మినీ మేడారంగా పేరు పొందిన గుర్రంపేట జాతర మంత్రి సీతక్క నియోజకవర్గంలో ఉండటంతో జాతర అభివృద్ధి పనులకు రూ.15 లక్షల నిధులు కేటాయించారు. దీంతో జాతర ప్రాగణంలో అభివృద్ధి పనులతో పాటు, పార్కింగ్, తాగునీరు, శానిటేషన్ సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ సారంగపాణి తెలిపారు. భక్తులకు లాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామన్నారు.


జాతర పనులను పరిశీలిస్తున్న అధికారులు

భారీ బందోబస్తు..

గుర్రంపేట జాతరకు ఎన్నడూ లేనివిధంగా సుమారు 80 మంది పోలీసులతో సీఐ స్థాయి అధికారులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే పోలీసులు జాతర బందోబస్తులో నిమగ్నమయ్యారు. అలాగే వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో భక్తులకు వైద్య సదుపాయాలు కల్పించనున్నారు. కాగా, తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం జాతర పనులను పరిశీలించారు. శానిటేషన్, పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు సిబ్బందికి వివరించారు.

తిరుమలగిరిలో..


సమ్మక్క–సారలమ్మ గద్దెలు

రేగొండ: మండలంలోని తిరుమలగిరి శివారులో నిర్వహించే సమ్మక్క–సారక్క జాతరకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. జాతరకు ఉమ్మడి మండలంతో పాటు పరకాల, వెంకటాపురం మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సుమారు రూ.20 లక్షల నిధులను కేటాయించారు. దీంతో పాండవులగుట్ట నుంచి జాతర వరకు, అలాగే వెంకటేశ్వర్లపల్లి, జగ్గయ్యపేట నుంచి జాతర వరకు మట్టి రోడ్డు పోయించారు. తాగునీటి కోసం రెండు నూతన బోర్లను ఏర్పాటు చేశారు. అలాగే భక్తుల కోసం స్నానాల గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

తల్లులకు గంగాభిషేకం


గంగాభిషేకానికి తీసుకువెళ్తున్న భక్తులు

కన్నాయిగూడెం: ఐలాపుర్ సమ్మక్క–సారలమ్మలకు భక్తులు గంగాభిషేకం చేశారు. మంగళవారం ఉదయం డోలీల వాయిద్యాల మధ్య శివసత్తుల పూనకాల నడుమ సర్వాయి నుంచి బుట్టాయిగూడెం మీదుగా గోదావరికి తీసుకెళ్లారు. మేడారం మహాజాతర అనంతరం ఐలాపుర్‌లో మినీ జాతర జరుగనున్నట్లు భక్తులు తెలిపారు.

క్లుప్తంగా

వెంకటాపురం తహసీల్దార్‌గా సదానందం



వెంకటాపురం(కె): మండల తహసీల్దార్‌గా మంగళవారం సదానందం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన సర్వర్ కన్నాయిగూడేనికి బదిలీపై వెళ్లారు.

బాధ్యతల స్వీకరణ

మహదేవపూర్: బదిలీల్లో భాగంగా తహసీల్దార్ లక్ష్మీరాజయ్య ములుగు జిల్లాకు వెళ్లారు. కాగా, డిప్యూటీ తహసీల్దార్ కె.కృష్ణ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా మంగళవారం బాధ్యతలు చేపట్టారు.

సమగ్ర విచారణ జరిపించాలి



చిట్యాల: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో అవకతవకలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని దీనిపై సమగ్ర విచారణ జరపాలని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు వేల్పుల రాజ్‌కుమార్ అధికారులను కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో అవకతవకలు జరిగినట్లుగా ఆధారాలు ఉన్నాయని అన్నారు. గతంలో విచారణకు వచ్చిన అధికారులు నామమాత్రంగా వచ్చి పోయారని అన్నారు. దీనిపై కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేలు స్పందించి పూర్తి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అయోధ్యకు వెళ్లిన రామభక్తులు



చిట్యాల: మండల కేంద్రానికి చెందిన రామభక్తులు అయోధ్య బాల రాముడి సన్నిధికి మంగళవారం వెళ్లారు. 500 ఏళ్ల రామభకుల్ల పోరాటానికి అయోధ్యలో బాల రాముడి ప్రతిష్ఠతో హిందువుల చిరకాలవాంఛ నెరవేరిందన్నారు. భారతీయ సంస్కృతిని ప్రతి ఒక్కరూ కాపాడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రామ భక్తులు బుర్ర సదయ్య, బుర్ర తిరుపతి గౌడ్, కనుకుల లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి , రాంరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, పుప్పాల సురేష్ బైరం భద్రయ్య, శ్రీరాం రఘుపతి పాల్గొన్నారు.

బ్యాడ్జీల పంపిణీ

మహదేవపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మంగళవారం బ్యాడ్జీలు, మాన్యువల్స్ పంపిణీ చేశారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ప్రతి శనివారం ప్రాథమిక పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధిస్తు బోధనాలో నైపుణ్యాలు మెలుకువలు నెర్పుట కోసం బ్యాడ్జీలు, దిక్సూచీ పుస్తకం (మాన్యువల్స్)పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియాల్ అధికారి కిషన్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి పర్సురాములు, అధ్యాపకులు రాజు, రమేష్, మున్నయ్య, రాజేందర్, రజిత, రవీందర్, ఆశ్ర, మహేష్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

చిట్యాల: మండలంలోని నవాబుపేట గ్రామ శివారు చలివాగు నుంచి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై జంగిలి రమేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలోని గ్యాస్ గోదాం వద్ద నవాబుపేట నుంచి ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోడంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్ ప్రవీణ్‌తో పాటు ఓనర్ తీగల నాగరాజులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మహాముత్తారం: అప్పుల బాధ భరించలేక పురుగుల మందుతాగి రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బోర్లగూడెం గ్రామానికి చెందిన జంగపల్లి వెంకటయ్య(72) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. రెండు సంవత్సరాల నుంచి ఎకరన్నర పత్తి, ఎకరన్నర వరి సాగుచేస్తున్నాడు. పంట దిగుబడి రావడం లేదు. దీంతో అప్పులు తేర్చే మార్గం కనిపించ లేదు. మనస్తాపానికి గురైన వెంకటయ్య సోమవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వనదేవతలను దర్శించుకున్న జేసీ


తల్లులను దర్శించుకుంటున్న జేసీ వెంకటేశ్వర్లు


పనులను పరిశీస్తున్న జేసీ వెంకటేశ్వర్లు

చిట్యాల: మండలంలోని వెంచరామి శివారు పురేడుగుట్ట సమ్మక్క సారలమ్మ వనదేవతలను జాయింట్ కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జాతరలోని పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు సకల సదుపాయాలు కల్పించాలని జాతర ఉత్సవ కమిటీని కోరారు. అనంతరం విద్యుత్, మరుగుదొడ్లు, స్నానాల గదులు, తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తుల కోసం రోడ్డు సౌకర్యం చాలా బాగా ఏర్పాటు చేశారని అభినందించారు. ఎంపీడీఓ రామయ్య, ఎంపీఓ రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ శివతేజ్, పీఆర్ ఏఈ తిరుపతి, పంచాయతీ కార్యదర్శి ఏలియాస్, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూల శంకర్‌గౌడ్, జాతర కమిటీ చైర్మన్ మల్లారపు మురళి ఉన్నారు.

మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్

కేకలు వేస్తూ కిందికి దిగిన మేడారం భక్తులు

కాళేశ్వరం: భూపాలపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ మద్యం మత్తులో బస్సు ర్యాష్‌గా నడిపించడంతో ప్రయాణికులు కేకలు వేస్తూ కిందికి దిగిన ఘటన కాళేశ్వరం–మహదేవపూర్ జాతీయ రహదారి 353(సీ) కుదురుపల్లి సమీపంలో మంగళవారం జరిగింది. మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా సిరొంచ నుంచి ములుగు జిల్లా మేడారం జాతరకు 58మంది భక్తులతో ఆర్టీసీ బస్సు మధ్యాహ్నం బయలుదేరింది. కాళేశ్వరం అటవీ ప్రాంతంలోని మలుపుల వద్ద డ్రైవర్ ర్యాష్‌గా నడిపించడంతో మద్యం మత్తులో నడిపిస్తున్నట్లు భక్తులు గమనించారు. బస్సు ఆపాలని కేకలు వేసినా డ్రైవర్ ఆపకుండా ముందుకు తీసుకువెళ్లాడు. మహదేవపూర్–కుదురుపల్లి మధ్యలో ఓ చెట్టువద్ద నిలిపి అక్కడి నుంచి డ్రైవర్ పారిపోయాడు. ఈ విషయమై డీఎం లక్ష్మీరాజయ్యను సంప్రదించగా డ్రైవర్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేరే డ్రైవర్‌ను ఏర్పాటు చేసి భక్తులను మేడారం పంపినట్లు తెలిపారు.


కాళేశ్వరం–మహదేవపూర్ అదవి మధ్యలో బస్సు దిగిన ప్రయాణికులు

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–02 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు పాఠశాలకు మంగళవారం ప్రింటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పింగిలి విజయపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రింటర్ ద్వారా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఎంతో ప్రయోజనం అన్నారు. ప్రింటర్ అందజేసిన పూర్వ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు అనిల్, రఘుపతి, చందర్, విద్యార్థులు గోనెల చందు, వేముల నవీన్, రాణి, స్వప్న, చెక్క తిరుపతి, వనం భద్రయ్య, పినగాని శేఖర్, గుండారపు మహేందర్, గుండారపు రమేష్, పినగాని సతీష్, తదితరులు పాల్గొన్నారు.



ప్రింటర్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


రాయపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర


పట్టా పాస్ పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ భవేష్‌మిశ్రా

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

రేగొండ(కొత్తపల్లిగోరి): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం ఉమ్మడి మండలంలోని పలు గ్రామాల్లో రూ.4.25 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతూ గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేస్తుందని అన్నారు. సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.కోటితో కుట్టుమిషన్‌పై స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం ఏర్పాటు చేస్తానన్నారు. అనంతరం మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ 17వ వార్షికోత్సవం ఉత్సవాల్లో పాల్గొన్నారు.

పట్టా పాస్ పుస్తకాల పంపిణీ

మండలంలోని గూడెపల్లి గ్రామంలో అసైన్డ్ భూములకు కలెక్టర్ భవేష్‌మిశ్రాతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు 40 మంది రైతులకు పట్ట పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి సాగు చేస్తూ పట్టదారు పాస్ పుస్తకాలు లేక ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా మిగిలారన్నారు. ఉమ్మడి రేగొండ మండలంలోని పలు గ్రామాల్లో ఏళ్ల తరబడి కాస్తులో ఉన్న రైతులకు కూడా త్వరలో పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. కోటంచ ఆలయాన్ని టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేయాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం గోరికొత్తపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతతో పాటు, అత్యధిక మార్కులు సాధించాలన్నారు. అలాగే మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మీ సేవ కేంద్రాన్ని ప్రారంభించారు. జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపీపీ పున్నం లక్ష్మి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఎంఈఓ వేల్పుల ప్రభాకర్, పీఆర్ ఏఈ సతీష్‌బాబు, జెడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు మాధవి లత నాయకులు సంపత్‌రావు, గాజర్ల అశోక్, బండి మహేందర్, గుటోజ్ కిష్టయ్య, దుగ్యాల రాజేశ్వర్ రావు, భిక్షపతి, శంకర్ పాల్గొన్నారు.



కొండాయి టు ఊరట్టం రోడ్డు సిద్ధం

ఏటూరునాగారం: మండలంలోని కొండాయి నుంచి మేడారం చేరుకునే దారిని పోలీసులు, అధికారులు రూట్ క్లియర్ చేశారు. మార్గమధ్యలో ఉన్న అడ్డంకులను తొలగించారు. గోవిందరాజు వెళ్లే దారిలో భక్తులు పోటెత్తడంతో ఎలాంటి అవాంతరాలు కలుగకుండా చూసేందుకు పోలీసులు బలగాలు మోహరించాయి. వాహనాల రద్దీ లేకుండా ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరిస్తున్నట్లు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తెలిపారు. బుధవారం సాయంత్రం గోవిందరాజులను పూజారులు, వడ్డెలు తీసుకెళ్లే క్రమంలో భక్తులు తాకేందుకు ప్రయత్నించే అవకాశం ఉండడంతో రోప్ పార్టీ ద్వారా మేడారానికి తరలించేలా ఏర్పాట్లు చేశారు.


దారిని క్లియర్ చేస్తున్న ఎస్సై కృష్ణప్రసాద్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మహదేవపూర్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదుట చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సామాజిక ఆరోగ్య కేంద్రం మెడికల్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ ఆస్పత్రి నుంచి ద్విచక్రవాహనంపై బయటకు వచ్చాడు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో చంద్రశేఖర్‌కు, ఢీకొట్టిన వ్యక్తికి ఇద్దరికి గాయాలయ్యాయి.


ప్రధాన కూడలి వద్ద పోలీసుల బందోబస్తు

రద్దీగా రహదారులు

మహాముత్తారం: మేడారం జాతర సందర్భంగా మండలంలోని ప్రధాన రహదారులన్నీ వాహనాల రాకపోకలతో రద్దీగా మారాయి. మేడారం వెళ్లడానికి మహాముత్తారం మండలంలోని కొర్లకుంట, యామన్‌పల్లి, నిమ్మగూడెం, పెగడపల్లి, బోర్లగూడెం, రేగులగూడెం, సింగారం నుంచి కాల్వపల్లి వరకు రహదారులన్నీ వాహనాలతో కిక్కిరిశాయి. మండలంలోని ప్రధాన రహదారుల వెంట ఉన్న కల్వర్టులు, మూల మలుపులు, ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద పోలీసులు బందోబస్తు చేపట్టారు. మూలమలుపులు, జంక్షన్ల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రమాదాలు జరుగకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకుంటున్నారు.


యామన్‌పల్లి నుంచి వెళ్తున్న వాహనాలు